# రిమోట్ కంట్రోల్

ఏదో ఆందోళనగా ఏదో అలజడిగా ఉంది మంజరికి. ఇన్నాళ్ళూ ఆందోళన. ఆదుర్దా మాత్రమే వుండేవి. ఇప్పుడు అలజడి మొదలైంది.

అంతకు మునుపు సురేష్‌కి ఎలా వుంటే ఇష్టమో ఎలా వుంటే అయిష్టమో ఏం చేస్తే నచ్చదో ఏం చేస్తే నచ్చుతుందో అర్థంకాక.... ఏం చెయ్యాలన్నా ఆదుర్దాగా ఆందోళనగా వుండేది.

సురేష్ అంతరంగమేమిటో ... అభిప్రాయమేమిటో ... నిన్ననే తెలిసింది - సూటిగా! ఘాటుగా! సరిగ్గా అప్పటి నుండే అలజడి మొదలయ్యింది.

అసలు ఆందోళన ఆదుర్దా తనకు అమ్మ నుంచే వచ్చాయేమో!

నాన్నకు సమయానికి అన్నీ అమర్చకపోయినా, ఇల్లు ఇల్లాలు, పిల్లలు శుభ్రంగా వుండకపోయినా నచ్చేది కాదు - ఆయనకు. అమ్మ నాన్న యింట్లో వున్నప్పుడు చీమ చిటుక్కుమననిచ్చేది కాదు.

నాన్న ఇంటికి వచ్చేలోపలే పడాల్సిన హడావుడి అంతా పడేది. ఇంటిని అద్దంలా, పిల్లల్ని ముత్యాల్లా వుంచేది. అమ్మకూడా చక్కగా తయారయి చెరగని చిరునవ్వుతో సిద్ధంగా వుండేది. ఆ హడావుడి ఆ తొందర చిన్నప్పుడు మింగుడు పడకపోయినా తరువాత తరువాత బాగా నచ్చేవి.

అమ్మ ఉరుకులు పరుగులు లయబద్ధమైన నాట్యంలా వుండేవి.

నాన్న పట్ల భయభక్తులు, శ్రద్ధాసక్తులు వయసుతో పాటే పెరిగాయి.

అమ్మ కనుసన్నలలో పెరుగుతూ ... అమ్మ కనుసైగలతో నాన్న కోపతాపాలకు బురిడీ కొట్టిస్తూ .... అమ్మ ప్రతీ పనినీ విశేషంగా భావిస్తూ ... అమ్మ అణుకువను ఆరాధిస్తూ ... అమ్మ అభిమానాన్ని ఆస్వాదిస్తూ వుండేవారు అన్నయ్య తను.

నాన్న మాట నాన్న నోట్లో వుండగానే అమ్మ అన్నీ అమర్చి పెట్టేది. ఎంత ముచ్చట వేస్తుందో వాళ్ళిద్దర్నీ చూస్తే ఆదిదంపతులంటే వారేనా అనిపిస్తుంది. ఇప్పటికి మాత్రం ... అమ్మ వున్నదే నాన్న కోసం. నాన్నే అమ్మ. అమ్మ నాన్న పనుల్లో ఎవర్నీ అలా జోక్యం చేసుకోనివ్వదు. వదిన వచ్చినా కూడా!

నాన్నకు ఇతరుల జోక్యం నచ్చదు మరి!

అయినా వదినకి అన్నయ్య పనులు ఎలానూ వుంటాయి.

అన్నయ్యకి కూడా అమ్మఅంటే ఎంతో ఇష్టం. అందుకే పెళ్ళవగానే వదిన్ని అమ్మ దగ్గర కొంతకాలం వుంచాడు. అమ్మలా...అచ్చమైన అమ్మలా...వదిన్ని మలచడానికి.

వదిన ఎంతో మంచిది. అమ్మ వెంట వెంట తిరుగుతూ - అన్నయ్య యిష్టాయిష్టాల్ని, అన్నయ్య చిన్ననాటి విషయాలు, చిన్న చిన్న విశేషాలు పొల్లుపోకుండా తెలుసుకొని మురిపెంగా మనసులో దాచుకుంది. అన్నయ్యకు యిష్టమైన వంటలు చేయించి చేసి - చూసుకుంది. మర్చిపోకుండా తూకాలతో సహా పుస్తకంలో రాసుకుంది. అన్నయ్యకు ఇష్టమైన రంగుల చీరల్నే వుంచుకొని మిగిలినవి పుట్టింటికి పంపేసింది.

వదిన వినయ విధేయతలకు నాన్న మీసం మెలేసాడు.

అమ్మ చెప్పడం మరిచిపోతుందేమోనని - నాన్న అప్పుడప్పుడు ఇల్లాలు ఎలా నడుచుకోవాలో పాఠంలా చెప్పేవాడు.

నాన్న పాఠాలు అమ్మకు అలవాటైపోయాయి. కానీ వదినా, తనూ మంత్రముగ్ధుల్లా వినేవారు. ఎంతో అనుభవంతో వదిన అన్నయ్య దగ్గరకి వెళ్లిపోయింది. అన్నయ్య అమ్మని ప్రశంసిస్తూ వుత్తరాలు వ్రాసేవాడు. అమ్మనే మలుచుకున్న నాన్నకు ప్రత్యేక ప్రశంసలు ఎప్పుడూ వుండేవి.

తనకూ అమ్మ పట్ల అభిమానం వెయ్యింతలు పెరిగిపోయింది.

అమ్మ ఆదర్శంగా, అమ్మ నేతృత్వంలో మరో అమ్మలా మారడానికి తనూ సిద్ధమైంది.

ఇంటీరియర్ డెకరేషన్ కోర్సులో చేరింది. ఇంటిని చక్కదిద్దుకోవడానికి సరియైన చదువు అన్నాడు నాన్న.

సురేష్ పెళ్ళవగానే - అత్తయ్య వాళ్ళతో కలిసివుండే అవకాశం లేకుండానే - ఇక్కడికి తీసుకు వచ్చేసాడు. సురేష్ గురించి అత్తయ్యను అడిగినా లాభం లేదేమో!

సురేష్ నిజంగానే కొరకరాని కొయ్య!

నాన్న అన్నయ్య ఇంటికి వచ్చీరాగానే కుర్చీలో చేరిగిల పడితే - చల్లటి మంచినీళ్ళ గ్లాసు అందివ్వడం అమ్మకూ వదినకూ నిత్యకృత్యం.

సురేష్ ఆ అవకాశమే ఇవ్వడు. నేరుగా ఫ్రిజ్ దగ్గరకి వెళ్ళి, నీళ్ళు తాగాకే... వచ్చి కుర్చీలో కూర్చుంటాడు. టీ తెచ్చే వరకైనా కుదురుగా కూర్చుంటాడా

అంటే అదీ లేదు. ఏదో మాట్లాడుతూ ఏదో మాట్లాడిస్తూ వంటింట్లోకి వచ్చేస్తాడు! టీ పొడి నీళ్ళల్లో వేసే లోపలే, కప్పులు కడిగి - సిద్ధం చేస్తాడు. తనకు ప్రతి రోజూ ఓటమే. అమ్మకి ఎలా సాధ్యమో నాన్న వచ్చీరాగానే పొగలు కక్కే కాఫీ సిద్ధం చేస్తుంది.

అమ్మ కానీ వదిన కానీ తన వాలకం చూస్తే ఏమనుకుంటారో! తను వాళ్ళను చూసి నేర్చుకున్నది ఇదేనా అని వాపోతారేమో! నాన్నో అన్నయ్యో అయితే అసలు సహించరు. కానీ...తనేం చేయగలుగుతుంది? ఈ విషయమనే కాదు ప్రతి విషయంలోనూ సురేష్ అంతే! సురేష్‌ని ఎంత వారించినా ఎంత బతిమిలాడినా నాన్నలా అన్నయ్యలా వుండడు. అలా వుండక పోవడం తనకు ఎంత మనస్తాపం కలిగిస్తుందో తెలుసుకోడు.

మంజరికి దుఃఖం ముంచుకొచ్చింది.

అతని ధోరణి అతనిదే.

అతని కోసం తను ఇంత శ్రమ పడుతున్నపుడు - అతని చిన్న పొగడ్త తనకు ఆకాశాన్ని అందుకున్నంత ఆనందాన్ని అందిస్తుందనీ. ప్రపంచాన్ని జయించిన ధీమాను కలిగిస్తుందని అతను తెలుసుకోడు.

అతని యిష్టాయిష్టాలే తన యిష్టాయిష్టాలు.

అతని రుచులు అభిరుచులే తన రుచులు అభిరుచులు.

అతని రాగద్వేషాలే తన రాగద్వేషాలు.

అతనే తను, అతను లేని తను లేదు.

మంజరి నిట్టూర్చింది.

ఈ విషయాల గురించి లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఇంత హఠాత్తుగా వచ్చేది కాదేమో - రశ్మి వాళ్ళింట్లో ప్రస్తావనకు రాకపోతే!

నిన్న రశ్మి భోజనానికి పిలిచింది.

సురేష్ - శరత్ చిన్ననాటి నుంచీ మంచి స్నేహితులు.

శరత్ భార్యగా పరిచయమైనా రశ్మి కొద్ది కాలంలోనే ఆత్మీయురాలిగా మంజరితో కలిసిపోయింది.

శరత్ ఆర్కిటెక్ట్. రశ్మి ఇంజనీర్. ఇద్దరూ కలిసే పని చేసుకుంటారు.

భోజనాలయినంత సేపూ మంజరి ముభావంగానే వుంది. మిగిలిన ముగ్గురి గలగల మాటల్లో పాలుపంచుకోక పోయినా - కనీసం చెవి ఒగ్గలేదు. ఎదురుగా

వున్న అక్వేరియంలో పల్టీలు కొడుతున్న రంగురంగుల చేప పిల్లల్ని చూస్తూ - భోంచేసింది.

భోజనాలయ్యాక - రశ్మి తమలపాకుల పళ్ళెం తీసుకొని, ముందుగదిలోకి దారి తీసింది. రశ్మి వెనకే మంజరి.

" ఏవిటోయ్.., మా వంటకాలు చూసి బెదిరిపోయావేమిటి? ఇందాక బిరియానీలో సాంబారేసుకున్నావ్?'' రశ్మి నవ్వుతూ మంజరిని నిలదీసింది.

''అబ్బెబ్బే...''మంజరి కంగారు పడి సర్ది చెప్పబోయింది.

''నీ అమూల్యమైన అభిప్రాయం నిరభ్యంతరంగా చెప్పేసేయ్! ఎంతయినా వంటకాలు అంత ఘెరంగా అవతరించడానికి కారణం నేనయితే కదా?'' రశ్మి భరోసా ఇస్తూ అంది.

''మరి?'' మంజరి ఆశ్చర్యంగా అడిగింది.

" ఇవ్వాళ శరత్ స్పెషల్! వాళ్ళ ఫ్రెండ్‌కి ఇష్టమైనవన్నీ తనే స్వయంగా వండి, వడ్డించాడు.''

''శరత్ వంట చేస్తారా?''

" భేషుగ్గా, లేకపోతే ఎలా కుదురుతుందోయ్? ఇవ్వాళంటే ఇద్దరమే. సరదాగా జరిగిపోతుంది. రేపు పిల్లా పీచూ....వగైరా...పెరిగాక? అయినా, ఆడుతూ పాడుతూ పని చేస్తుంటే అలుపు సొలుపేమున్నదీ'' తాళం వేస్తూ పాడడం మొదలెట్టింది రశ్మి మంజరి నవ్వాపుకోలేక పోయింది.

''మంజరీ...నువ్వలా నవ్వుతూంటే ఎంత బావున్నావో తెలుసా?'' రశ్మి మనస్ఫూర్తిగా మెచ్చుకుంది.

మంజరి టక్కున నవ్వాపింది. గంభీరంగా, ఎప్పటిలా అయిపోయింది.

నిజమే, తను గలగలా నవ్వి చాలా రోజులే అయ్యింది. ఎందుకని? ఏమో! ఆ గుర్తొచ్చింది! ఓ రోజు ఇలాగే నవ్వితే సురేష్ ఏదో అన్నాడు. ఏమన్నాడు? భలేగా నవ్వుతావోయ్ కోళ్ళేట్ నవ్వులా...అనే కదూ? ఆ...అంతే! ఇక తనెందుకో మళ్ళీ అలా నవ్వబుద్ధి కాలేదు. అలా నవ్వడం సురేష్‌కి ఇష్టం లేదేమో?నాన్న ముందు అమ్మకానీ, అన్నయ్య ముందు వదిన కానీ గలగల కాకపోయినా చిరునవ్వుకూడా నవ్వరు. తనూ కాస్త నిగ్రహంగా వుండాలి. అందుకే నవ్వును నాలుగు విధాల నియంత్రించుకుంది. ఈ రోజెందుకో...!

''అరరే...నేనేమీ అన్లేదు బాబోయ్..అన్లేదు! నువ్వు నవ్వు!'' రశ్మి కంగారుగా అరిచినంత పని చేసింది.

మంజరి అదేం లేదనట్లు తలాడించింది.

అసలు విషయం వేరే వుంది. అది రశ్మితో ఎలా చెప్పడం? ఇంటి విషయాలు గడప దాటకూడదన్నారు కదూ? ఎవరన్నారు? ఎవరో ఏమో కానీ..తనతో అమ్మో...వదినో..అన్నారు.

మొన్న రాత్రి సురేష్ తనూ భోంచేస్తున్నారు.
ఇంతలో హాస్పిటల్ నుంచి ఫోన్ వచ్చింది.
సురేష్ ఏదో తిన్నానిపించి హడావుడిగా వెళ్ళిపోయాడు.

తనకు ఉసూరుమనిపించింది. సురేష్ వచ్చీరాగానే ఏదైనా తినడానికోతాగడానికో ఇవ్వాలని మెలకువగానే కూర్చుంది. ఒంటిగంట గడిచినా సురేష్ రాలేదు.

అక్కడ పరిస్థితి ఎలా వుందో ఏమో.. ఆలోచిస్తూండగానే కునుకు పట్టేసింది. సురేష్ ఎప్పుడు వచ్చాడో తెలియదు.

తెల్లారాక వంటింట్లో ఏదో మార్పు కనిపించింది. సరుకులసీసాలు అడ్డదిడ్డంగా వున్నాయి. స్టౌ మీద పాలగిన్నె, సింక్‌లో కప్పు సాసర్ పడి ఉన్నాయి.

సురేష్ కాఫీనో టీ నో చేసుకొని తాగినట్లున్నాడు.

మంజరికి చెప్పలేనంత దుఃఖం వచ్చింది.

సురేష్ రాత్రి తెల్లవార్లూ కష్టపడుతూంటె - తనుమొద్దులా నిద్రపోయింది. సురేష్ ఏమనుకున్నాడో ఏమో! అలసి పోయి వచ్చిన అతనితో ఇలాగేనా ప్రవర్తించేది? తన బాధ్యతా రాహిత్యానికి తన మీద తనకే అసహ్యంగా వుంది. సిగ్గుతో తల బాదుకోవాలనిపించింది.

అమ్మ ఎంత చురుగ్గా వుండేదో...వదిన ఎంత చలాకీగా వుండేదో..తనకు తెలియదా? ఇంతటి అలక్ష్యం చేసానని తెలిస్తే వాళ్ళేం అనుకుంటారు?

తనలా చేసుంటే అన్నయ్య వదిన్ని క్షమించేవాడేనా...?

అదే నాన్నయితేనా...!

ఏడ్చి ఏడ్చి మంజరి మొహం వాచిపోయింది.

సురేష్‌కి క్షమాణలు చెప్పుకోవడానికి మాటల్లేవు.

సురేష్ మాత్రం ఎప్పటిలా తన పని తాను చేసుకొని, హాస్పిటల్‌కి వెళ్ళిపోయాడు.

మంజరికి సురేష్ మౌనం రంపపుకోత లాగుంది. సురేష్ తనను కోప్పడి, అరిచి అలిగి, ఏదో ఒకటి చేస్తే బావుణ్ణు.

సురేష్ ఏమీ చేయలేదు.

మంజరి విల విల లాడి పోయింది.

తన బాధ రశ్మితో ఏం చెబుతుంది? చెప్పినా రశ్మికేం అర్థం అవుతుంది? శరత్‌తో..వంటపని చేయిస్తూ - మురిపెంగా - గొప్పగా చెప్పుకొంటున్న రశ్మికి తను ఎలా అర్థం అవుతుంది?

మంజరి పెదవుల మీద పేలవంగా నవ్వొకటి కదలాడింది.

కానీ, రశ్మి ఆత్మీయతలో తను కరిగిపోకుండా వుండగలదా?

మంజరి అప్రయత్నంగా అంది, ''ఆయనకు నచ్చేలా.. ఆయన మెచ్చేలా వుండాలని శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. అయినా ఆయనను సంతోష పెట్టలేక పోతున్నాను.''

మంజరి కనురెప్పలపై నీటి ముత్యాలు మెరిసాయి.

రశ్మి నిటారుగా కూర్చుంది. మంజరి తల వాల్చేసింది.

'' నా నవ్వు నా ఏడుపు నా చేతుల్లో లేవు. నా భావోద్వేగాలను నిర్దేశించే రిమోట్ కంట్రోల్ నా చేతుల్లో లేదు?'' మంజరి బొంగురు పోయిన గొంతులో ఒక్కో మాటా భారంగా పలికింది.

ఇద్దరూ చాలా సేపు మౌనంగా కూర్చున్నారు. కాసేపటికి రశ్మి తేరుకుంది. తమలపాకుల పళ్ళాన్ని వళ్ళోకి తీసుకుంటూ అంది.

''నువ్వు కిళ్ళీలుచుడతావా, మంజరీ? నేను ఫ్రూట్స్ సలాడ్ పెట్టుకొస్తాను.''

''అవేవో నువ్వే చుట్టు రాదూ? సలాడ్ నేను పెట్టుకొస్తాలే.'' అంటూ మంజరి లేచింది.

''సలాడ్ ఫ్రిజ్‌లో వుంది. కప్స్ టేబుల్ మీద వున్నాయి''. మంజరి ఓ శుష్క మందహాసం రశ్మి పైకి విసిరేసి, ఫ్రిజ్ దగ్గరకు నడిచింది. రశ్మి వాతావరణం తేలిక పరచడం ఎలా అన్న ఆలోచనలో పడింది. మంజరి అక్కడికి వెళ్ళేసరికి టేబుల్ దగ్గర సురేష్, శరత్ కూర్చుని వున్నారు. శరత్ కట్ చేస్తోన్న పళ్ళ ముక్కల్ని, సురేష్ కస్టర్డ్‌లో వేస్తున్నాడు. మధ్యలో ఓ ముక్కనోట్లో వేసుకుంటూ మాట్లాడుకుంటూన్నారు.

మంజరి గుమ్మం దగ్గరే ఆగిపోయింది.

" ఏమైనా...మానవ సంబంధాలలో సమన్వయరాగం పలకించడం కష్టమేనోయ్..." అన్నాడు సురేష్.

"అందులోనూ మీ లాంటి వాళ్ళకి! గుండెను చీల్చడం తేలికే కానీ హృదయాన్ని తెరిచి చూడడం చేతకాదు!" చేతిలోని చాకును ఆడిస్తూ - నాటకీయంగా అన్నాడు. శరత్.

"సరేలేవోయ్.. అక్కడికి తమరేదో ఇటుకలు పేర్చగానే ఇంటిని నిలబెట్టినట్లు మాట్లాడుతున్నావ్!"

"నిజమే సురేష్! నేనెప్పుడూ అనుకుంటూ వుంటాను - నాలుగ్గోడలు - వాటి రంగులు - వాటి మీది చిత్రపటాలు - వాటి మధ్యన సామాగ్రి - వీటితో ఇల్లు పూర్తవుతుందా? ఇంట్లోని మనుషులు, వారి అనుబంధం ఆప్యాయత, ఆనందం, ఆవేదన - ఇవే కదా ఇంటిని ఇల్లుగా మలిచేది!" శరత్ గంభీరంగా అన్నాడు.

" ఏమైనా ఇల్లుగా మలచుకోవడం, నిలుపుకోవడం అంత సులభమైన విషయాలు కావు" సురేష్ తేల్చి చెప్పేసాడు.

దేనికి ఉపోద్ఘాతం అన్నట్లుగా ఆసక్తిగా చెవి వొగ్గింది మంజరి.

శరత్ సురేష్ వైపు కుతూహలంగా చూసాడు.

"తన గురించి తను ఆలోచించుకోవడానికి, నిర్ణయించుకోవడానిక్, తనకుగా తను వికసించడానికి మంజరికి అవకాశం వుండాలని నా ఉద్దేశం. అందుకే తన విషయాలలో జోక్యం చేసుకోదలచుకోలేదు. అదేమిటో మంజరి మరింత ఉదాసీనంగా మరింత ముభావంగా తయారవుతోంది."

సురేష్ మంజరి గురించి ప్రస్తావించడం, ఉద్వేగంగా మాట్లాడడం ఇదే మొదటిసారి. శరత్ సురేష్ వంక ఆశ్చర్యంగా చూసాడు.

"అసలు విషయం ఏంటంటే... మంజరి ప్రతిక్షణం తనలా వుండకుండా - నాలా వుండాలని ప్రయత్నించడం, నా పరిధిలోకి తను ఇమడాలని తాపత్రయ పడడం - నా యిష్టా యిష్టాలను తనవిగా అనుకరించడం - ప్చ్..." సురేష్ నిట్టూర్చాడు. సురేష్ ఏకధాటిగా మాట్లాడడం మంజరి ఎప్పుడూ వినలేదు. అందులోను తన గురించి! గుమ్మానికి చేరగిలబడి, చెవులప్పగించింది. "తను ఒక పోస్ట్‌గ్రాడ్యుయేట్. తనంటూ, తనదంటూ పాతికేళ్ళ జీవితం గడిపింది. హఠాత్తుగా నా భావచట్రంలో ఇమడాలను కోవడం మూర్ఖత్వం కాదూ?"

"భర్తంటే భయపెట్టేవాడు అని అర్థం చెప్పుకోవాల్సి రావడం మన

దౌర్భాగ్యం. మనల్ని చూడగానే బెరుకు బెరుగ్గా... వణికి పోతూ... ఒదిగిపోతూ...! ఆ ఊహలే.. నన్ను నేను అసహ్యించుకొనేలా చేస్తాయి!''

మంజరికి కమ్ముకున్న మబ్బులేవో విచ్చిపోతున్నట్లుగా అనిపించింది.

కొంగు నోట్లో కుక్కుకుని కిక్కురుమనని అమ్మ, గుడ్లనీరు నింపుకొని కుళ్ళిపోయే వదిన - కళ్ళ ముందుకు వచ్చారు.

మంజరి కళ్ళల్లో నీళ్ళూరాయి.

''నేనెలాంటి కలలు కనేవాణ్నో తెలుసా? నా అలవాట్లు, అభిరుచులు - తన అలవాట్లు అభిరుచులు కలిసిపోయిన మిళిత సంస్కృతి మా కుటుంబ సంస్కృతి కావాలని! ఒకరిని ఒకరం ప్రభావితం చేసుకోవాలే కానీ ఒకరిపై ఒకరం పెత్తనం చేసుకోకూడదని!''

''హియర్! హియర్! గొప్ప సందేశమే! ఇంతకీ... మంజరితో గొడవేమైనా వచ్చిందా?'' శరత్ అనుభవజ్ఞుడిగా నవ్వాడు.

''గొడవ లాంటిదేం కాదు కానీ..''

''మౌనపోరాటం లాంటిదా?'' ఆటలు పట్టిస్తున్నట్లుగా అన్నాడు శరత్.

''సర్లే వినవోయ్! మొన్న రాత్రి సీరియస్ కేస్ వచ్చి హాస్పిటల్‌కి వెళ్ళాల్సి వచ్చింది...''

'' ఆలుమగలు - సినిమా అన్నమాట!'' శరత్ తెలిసిపోయినట్లుగా నిట్టూర్చాడు.

''నువ్వు వేళాకోళాలాపితేనే చెపుతాను!''

''మీ డాక్టర్లకి కోపం పనికిరాదబ్బాయ్!'' శరత్ నవ్వాడు.

సురేష్ కూడా నవ్వేసాడు.

''నేను వచ్చేసరికి మంజరి నిద్రపోతోంది. నేను ఓ కప్పు కాఫీ కలుపుకొని తాగాను. మంజరి తనను లేపకుండా కాఫీ కలుపుకున్నానని ఎంత బాధపడిందో తెలుసా? తనది మొద్దు నిద్ర అనీ...అలసిపోయి వచ్చిన నాతోనే పని చేయించాల్సి వచ్చిందనీ...చాలా..చాలా..బాధ పడింది కుమిలిపోయింది.

ఈ విషయమనే కాదు... ప్రతి విషయంలోనూ అంతే. చాలా కాజువల్‌గా నేను చేసే కామెంట్స్‌కి అత్యంతప్రాధాన్యత ఇస్తుంది. అవి సూచనలుగా మాత్రమే గ్రహించి - ఆలోచించి - నిర్ణయించుకోవాల్సింది తనే కదా? నన్ను ఇంప్రెస్ చేయాలన్న తపన మంజరి సృజనాత్మకతకు అవరోధం అవుతుందేమో అన్నదే నా బాధంతా!'' సురేష్ చెప్పుకు పోతున్నాడు.

సురేష్ మాటలు మంజరిని ఆలోచనలుగా చుట్టుముడుతున్నాయి. అలజడి కలిగిస్తున్నాయి. తను పోస్ట్‌గ్రాడ్యుయేట్ అన్నది ఎలా మరిచిపోయింది.

మరిచిపోవడమే తన ఆనందం అనుకుని మరీ మరిచిపోయింది.

అమ్మావదినలు మరిచిపోయినంత సహజంగా తనూ మరిచిపోయింది.

అమ్మ సంగతి తామే కాదు కదా అమ్మే మరిచిపోయింది.

ఇక వదిన..కాలేజీ లో తన సీనియర్... ఎంత చక్కగా పాడేది!

వదినను తమ కుటుంబంలో కలిపింది... ఆ పాటే కదా!

ఈ మధ్యకాలంలో ఓ కూనిరాగమైనా తీసిందా?

కోయిల పాటనెలా మరిచి పోయింది?

ఆగకుండా ఫోన్ మోగడంతో మంజరి ఉలిక్కిపడింది.

పరధ్యానంగా ఫోన్ తీసుకుంది.

"హాయ్ మంజరీ! నేను రశ్మి. నిన్న చెప్పానే... ఇంటీరియర్స్ విషయం. ఈ రోజున వస్తావా?" "ఎప్పుడు రమ్మంటావ్?" మంజరి ప్రశ్నించింది.

" ఎప్పుడు రావాలనుకుంటే అప్పుడే!"

మంజరి చక చక తయారయి రశ్మి దగ్గరకు వెళ్ళింది

రశ్మి తను చేస్తోన్న బిల్డింగ్ వర్క్‌ను ఉత్సాహంగా చూపించింది. చిన్నపిల్లలా సంబర పడుతూన్న రశ్మిని చూస్తే మంజరికి ముచ్చటేసింది.

రశ్మి ఇంటీరియర్ డెకరేటర్‌ని పరిచయం చేసింది.

ముగ్గురూ చాలా సేపు మాట్లాడుకున్నారు. చర్చించుకున్నారు.

ఇంటికే పరిమితం అనుకున్న విద్యను అపరిమితం చేసుకోవడంలో ఆనందమేమిటో మంజరి మనసారా గ్రహించింది.

మంజరి ఆనందానికి హద్దుల్లేవు.

అమ్మ స్వయంగా పూలూ లతలు కుట్టిన దుపట్టా - వదిన పూసలు చమ్కీలతో అలంకరించిన దుపట్టా - సురేష్‌కి ఇష్టం వుండదేమోనని అల్మారా అడుగున పడేసి వుంచిన దుపట్టా - గుర్తొచ్చింది ఎందుకనో!

మంజరి దానిని భద్రంగా బయటకు తీసింది. ఆప్యాయంగా తడిమింది. . తల మీదుగా వేసుకొని - తన కిష్టమైన పాట పాడుతూ - పసిపాపలా

ఇల్లంతా గెంతులు వేసింది. ఎక్కడి నుండో లయబద్ధంగా వినిపిస్తోన్న రశ్మి కంఠం మంజరి ఉత్సాహానికి ఊపిరి పోస్తోంది.

''మన భావాల రిమోట్ కంట్రోల్ మన చేతుల్లోనే వుంటుంది. చాలా మట్టుకు మనకి తెలియకుండానే...మనం తెలుసుకునే లోపలే అది అన్యాక్రాంతం అవుతుంది. ఎందుకంటే, దానిని అందుకని అగాధాల్లో అణిచి పెట్టాలన్న ప్రయత్నం అన్ని వైపులా, అహర్నిశలూ జరుగుతూనే వుంటుంది కనుక. మన వ్యక్తిత్వంలోని స్పష్టత మాత్రమే.. అది పరాధీనం కావడానికి తీవ్ర అవరోధం అవుతుంది. అందుకే మనం వ్యక్తులుగా ఎదగాలి. పూర్ణ వ్యక్తులుగా ఎదగాలి. ప్రత్యేక వ్యక్తులుగా ఎదగాలి. మనల్ని నిర్దేశించేది - నియంత్రించేది ఎవరో కాదు...మనమే! అది తెలుసుకొని జీవించాలి. అందులోనే ఆనందం కూడా!''

ఆ సాయంత్రం సురేష్ చేతి టీ మాధుర్యాన్ని మంజరి ఎంతో ఆనందంగా ఆస్వాదించింది.ముసి ముసి నవ్వులతో వెలిగిపోతోన్న మంజరి మొహం వంకా - మిలమిల మెరుస్తోన్న ఆమె కళ్ళవంకా - సంతోషంగా చూస్తూ సురేష్ అడిగాడు.

'' ఏవిటోయ్... ఆ కోల్గేట్ నవ్వులూ?''

'' ఇంక కోల్గేట్‌లూ లేవు...కోకోనట్‌లూ లేవు...అన్నీ క్లోజప్‌లే!'' నవ్వుతూనే లోపలకి తుర్రుమంది మంజరి. ఆమె వెనకే సురేష్.

వనిత ఆగస్టు 1996